# ఆదర్శాలు - అవాంతరాలు

శ్రీమతి పద్మావతీ గంగాధర్

పరిష్కారమార్గమే లేదనుకొని, నిరాశా నిస్పృహలతో తల్లడిల్లుతూ, అంధకారబంధురమైన జీవితాన్ని తల్చుకొని కుమిలిపోతూ వున్నప్పుడు, తలవని తలంపుగా, ఊహించనంత తేలికగా, ఆ సమస్య పరిష్కారమయినప్పుడు ఆ క్షణం, హృదయాన్ని తేలికపర్చి, జీవితానికి ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కూర్చటమేగాక, బ్రతికినన్నాళ్ళు, ఆ సంఘటన, ఆ క్షణం, గుర్తు వుంటూనే వుంటాయి. సమయాసమయాలనుబట్టి కెలుకవేస్తూనే వుంటాయి.

అయిదు సంవత్సరాల క్రితం, ఆదివారంనాడు, కూర్చొని నా బ్రతుకుని తల్చుకుని ఏడుస్తూవుండగా దాసీది ఒక వ్యక్తిని లోపలకు తీసుకొని వచ్చింది. ఆయనే మా నాన్న అట. ఇది ఆయనే చెప్పాడు. నానాదేశ సందర్శనంచేసి, అనేక ఉద్గ్రంథాలలో చెప్పిన సూక్తులను, తన స్వార్థానికి తార్కికంగా ఉపయోగించుకొని, అరగంటసేపు అనర్గళ ధారాపాతంగా, మాట్లాడివెళ్ళిన ఆయనకు నేను కూతురునా అని నాకు చాల ఆశ్చర్యంగా వుంటుంది యిప్పటికీను.

నేను మూడుసంవత్సరాల బిడ్డగా వున్నప్పుడే, మా నాన్న, నన్నూ, అమ్మనూ వదలివెళ్ళాడు. ఎందుకు మమ్మలను అలా వదలివెళ్ళాడో అప్పటికీ, యిప్పటికి నాకు సరిగా తెలియదు. అసలు విషయం అమ్మ బ్రతికివున్నంతకాలం ఎప్పుడూ చెప్పలేదు కూడాను. నేను, వాళ్ళూ, వీళ్ళూ చాటుగా, మాటుగా చెప్పుకొంటూవుంటే గా వినటం తప్పితే, అమ్మను ఎప్పుడైనా అడగటానికి కూడ సాహసించలేకపోయాను. ఆమె హృదయపు గాయాన్ని రేపి బాధపెట్టటం నా చేతకాని పని.

ఉన్న నాలుగెకరాల కొండ్రతో, తండ్రిలేని కొరత లేకుండా, అమ్మ అన్ని కష్టాలకు ఓర్చి, నన్ను పెంచి పెద్దదానిని చేసింది. నా చదువు, సంధ్యల విషయంలో ఎంతో శ్రద్ధతీసుకొంటూ వుండేది. అలా నేను కూడ చాల శ్రద్ధతో చదువుతూ, క్లాసులో అందరికన్నా మిన్నగా వుండి, మాష్టర్ల ఆదరాభిమానాలు చూరగొనడం, స్కాలరుషిప్పు రావటం జరిగింది. నేను స్కూలుఫైనలకు వచ్చేటప్పటికి అమ్మ ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఆమె యింకా ఎంతోకాలం బ్రతుకదేమోననే అధైర్యంతో, నా బ్రతుకును గూర్చిన ఆందోళనతో మరీ క్షీణించిపోయింది. నన్ను ఒక అయ్యచేతిలో పెట్టి సెలవు తీసుకోవాలనుకొన్నది. నాకు చదువుకోవాలని, అది చేయాలి, యిది చేయాలి, అని ఎన్నో ఊహ లున్నప్పటికీ, ఎంతో అనురాగంతో, సర్వత్యాగంచేసి కలలుగంటూ పెంచిన అమ్మ మాటను కాదనలేకపోవటం అలా వుంచి, అది నా విధ్యుక్త ధర్మంగా తలంచాను.

అమ్మ అనుకొన్నట్లుగానే, మాకు యిరుగూ, పొరుగూ, దూరపు బంధువు. అసలు బాసటగా వుంటున్న కుటుంబానికి నేను కోడలిగా వెళ్ళటం జరిగింది. రాము దాదాపు ఎప్పుడూ మా యింట్లోనే వుంటూవుండేవాడు. నాకన్నా నాలుగు సంవత్సరాలు పెద్ద. బి. ఏ. చదువుతూ వున్నాడు. ఉన్నదానిలో లోటు లేకుండా, మా యిద్దరకు పెళ్ళిఅయిన తరువాత, రాము బి. ఏ. పూర్తిచేయటానికి వెళ్ళాడు. నేను స్కూలుఫైనలు పూర్తిచేయ నిశ్చయించాను. అలా హాయిగా చీకూ, చింతా లేకుండా కాలం గడిచిపోతూ వుండగా, ఒకనాటి అర్ధరాత్రి అమ్మ తన బాధ్యతను తీర్చుకొన్నాననే తృప్తితో శాశ్వతంగా కళ్ళు మూసింది.

ఆనాటినుండే నా జీవితంలో మరో అధ్యాయం మొదలు. బాధ, బాధ్యత అంటే ఆనాడే నేను తెల్సుకొనగల్గాను. ఇంతవరకు కన్నతండ్రి ఎవరో నాకు తెలియకపోయినా, కళ్ళల్లో పెట్టుకొని, క్షోభను, వ్యధను నాకోసం దిగమ్రింగి, అహోరాత్రం అష్టకష్టాలుపడి, నాకొరకు అంత బరువును మోసి బాధ్యతను తీర్చుకొని, అమ్మ నన్ను అంధకారంలో వదలి వెళ్ళింది. జీవితంపై అమ్మ చాటుగా పెరుగుతున్న రోజులలో పెంచుకొన్న మమతలు, మమకారాలు సన్నగిల్ల మొదలుపెట్టాయి.

స్వార్థంగా, ఎవరిగోడవా పట్టించుకోనకుండా, ఆ దశలు తనపని కాదన్నట్లుగా కాలచక్రం కదులుతూనే వుంది. నేను స్కూలు ఫైనలు పరీక్షయ్యాను. రాము బి. ఏ. పరీక్షయ్యాడు. కుటుంబభారాన్ని అనుకోనకుండానే రాము తీసుకోవల్సిన అగత్యం ఏర్పడింది. చదువుకు స్వస్తి చెప్పవల్సి వచ్చింది. ఒక సంవత్సరం తిరుగకముందే రాముకు ఉద్యోగం దొరకటం మేము ఇద్దరం పట్నంలో కాపురం పెట్టటం జరిగింది.

ఇప్పటికీ నాకు ప్రతివిషయం గుర్తు వుంది. అదే నాలో దోషం. చాల విషయాలు మర్చిపోదామన్నా మరువలేను, మరపురావు కూడాను. అదే యీనాడు దుఃఖభూయిష్ఠమైన యీ జీవితానికి ఊరట కల్గించటం గాని, హృదయము గాయాలను రేపటంగాని చేస్తూ వుంటుంది.

ఆ చలికాలపు వెన్నెలరాత్రి నాకు ఎంతో బాగా గుర్తు వుంది. ప్రక్కనపరుండి, పైకంక చూస్తూ వున్న రాము ప్రక్కకుతిరిగి, అకస్మాత్తుగా నా చేతిని తన చేతిలోనికి తీసుకొని "పారూ, నేనొకటి అడుగుతానుగాని, నిజంగానీ ఉద్దేశ్యం చెప్తావా?" అన్నారు.

"ఏమిటండి?"

"ముందు మాట యివ్వాలి."

"సరే."

"తప్పవు గదూ!"

"ఊహు."

"నీకు చదువంటే చాలయిష్టం గదూ?"

"అవును."

"మరి కాలేజీలో చేరుతావా యీ సంవత్సరం?"

"కాలేజిలోనా... నేనా?"

"అవును పారూ. నిజంగానే. నీకు చదువంటె అభిరుచి వుండటం అలా వుంచి, తెలివితేటలుకూడ వున్నాయి. నిజానికి నీ తెలివితేటలు యిలా వృథా అవ్వటం నాకేమాత్రం యిష్టంలేదు. అంతిస్వార్థంగా బ్రతకటంకూడ నాకు యిష్టంలేదు. నీవు చదువుకొని పైకివస్తే, నీకూ ఒక ఉద్యోగం దొరికితే, చన్నీళ్ళకు వేడినీళ్లు తోడయినట్లుగా వుంటుంది. ప్రస్తుతం మనకు పిల్లల బాదరబందీకూడా లేదు; వచ్చేది మనకు పుష్కలంగానే సరిపోతుందికూడాను. నేనుకూడ నీచదువుకు చేతనయినంత సహాయపడుతూవుంటాను. ఏమంటావు పారూ? నా కోరికను కాదనవు గదూ!"

"నాకు చదు వెందుకండి?"

"కాదు, పారూ, నామాటను కాదనకు."

ఆనాడు అలా రాము, ఎంతో అనురాగంతో కన్నీళ్ళపర్యంతమై, చదువు కొనసాగించటానికి నన్ను ఒప్పించాడు.

ప్రొద్దున్నే యిద్దరం యింటిపనులన్నీ చూసుకొని, పదిగంటలకు నేను కాలేజీకి, రాము ఆఫీసుకు బయలుదేరి వెళేవాళ్లం. మధ్యాహ్నం నాకు క్లాసులు లేకపోతే యింటికి తిరిగివచ్చి యింటిపనులు చేస్తూ వుండేదాన్ని. నాకు క్లాసులున్నప్పుడు సాయంకాలం తిరిగి వచ్చినతరువాత యిద్దరం కలిసి మరల యింటిపనులు చేసుకొంటూ వుండేవాళ్ళం. నేను రాత్రిళ్లు చదువుకొంటూ వున్నంతసేపూ, రాముకూడా మేల్కొనివుండి, నాకు పాఠాలు చెబుతూవుండటమో, నోట్సులు కాపీ చేసిపెట్టుతూ వుండటమో చేసేవాడు.

అలా రోజులు ఎంతో హాయిగా, అనురాగపు టానందాలతో గడచిపోతూ వుండేవి. నేను బి.ఏ, ఆనర్స్ మొదటి తరగతిలో పరీక్షయ్యాను.

ఏదో ఒక ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉండాలనుకొన్నా. కాని యూనివర్సిటివాళ్లు స్కాలరుషిప్పు యివ్వటంవల్ల, అన్నిటికన్నా రాము బలవంతంమీదను, మరల నేను రీసెర్చికి యూనివర్సిటీలో చేరాను. నిజానికి నాకేమాత్రం అది యిష్టం లేదు. కుటుంబ జీవితానికి దూరమవుతున్నాననే భయంకూడ నాలో లేకపోలేదు. కాని రాము మాటను కాదనే శక్తి లేకపోవటంవల్ల యిష్టంలేని పనికి పూనుకొన్నాను.

అప్పుడే చంద్రంతో పరిచయం అయింది. అతను కూడ నాలాగనే స్కాలరుషిప్పుమీద రీసర్చికి చేరాడు. మేము యిద్దరమే అప్పుడు రీసెర్చిలో చేరింది. అందువల్ల ఎప్పుడూ ఎక్కువగా కలుసుకుంటూ వుండేవాళ్ళం. కలిసి పని చేస్తూ వుండేవాళ్ళం. అతనికుటుంబ విషయాలు. మంచీ, చెడూ, అప్పటికి నాకు తెలియనే తెలియవు. అయినా ఆనాడు తెల్సుకోవలసిన అగత్యం మట్టుకేముంది? మా యింటికి వస్తూ పోతూ వుండేవాడు. పండుగలకు పబ్బాలకు మాయింటికి భోజనానికి వస్తూవుండేవాడు. చాల కలసిమెలసి ఎంతో యిదిగా వుండేవాడు. రాముకు చంద్రానికికూడ చాల స్నేహం ఏర్పడింది. స్వంత అన్నదమ్ములకన్నా ఎక్కువ ఆదరంతో వుండేవారు.

అలా రోజులు గడచిపోతూ వుండగా నేను అమెరికా వెళ్ళి చదవటానికి స్కాలర్‌షిప్పు యిచ్చారు. ఈసారి రాము బలవంతానికి తోడు, చంద్రం, మా ప్రొఫెసరుకూడ బలవంతంచేసి అమెరికా పంపారు. కాని నాలో మొదటనుండి భవిష్యత్తులో భయానకమైనది ఏదో జరుగుతుందని అనుమానం, భయం వుంటూనే వుండేది. నా అభిప్రాయాలను నెరవేర్చుకొనటంలో నేనెప్పుడూ నిస్సహాయురాలనే.

"అదిగాదు పారూ, అవకాశం అనేది మానవుడు అనుకొన్నప్పుడు, కావాలనుకొన్నప్పుడు రాదు. వచ్చిన అవకాశాన్ని సక్రమంగా ఉపయోగించుకొనటంలోనే వుంది మానవుని విజ్ఞానం, యోగ్యతాను. నీవు చాల అదృష్టవంతురాలవు పారు. ఈ అవకాశాన్ని జారవిడవకు. నాకోసం నీవేమీ విచారించనద్దు. నాపై నీకు ఎంత అనురాగ విశ్వాసాలున్నవో, నాకుకూడ నీపై అంతకన్న ఎక్కువ ప్రేమ విశ్వాసాలున్నాయి. మనం యిద్దరం ఒకరినొకరం అర్థం చేసుకొన్నంత కాలం లోకానికి మనం వెరువవలసిన పనిలేదు. నా మాట విను పారు. ఏది వచ్చినా మన మేలుకొరకేనని మర్చిపోకు. నాకే గనుక యిలాంటి అవకాశం కలిగివుంటే నిన్ను విడచి వెళ్ళేవాడనుగాను? ఏమీ నా గురించి విచారించకు పారు. తప్పక వెళ్ళిరా. నీవు ఎక్కడున్నా, నీవు వ్యక్తిగా బ్రతకడమే నాకు కావల్సినది. ముందుకు పోగల అవకాశాలున్న నీవు ఒక వ్యక్తి ఐహిక సుఖంకొరకు, నీ ఉజ్జ్వల భవిష్యత్తును కాలదన్ని, ఎంతో త్యాగం చేశాననిగాని, ఎంతో మంచి చేశాననిగాని అనుకొంటే, ఎవరికొరకు నీవు వెళ్ళవద్దనుకున్నావో, ఏ వ్యక్తికొరకు అవకాశాన్ని కాదన్నావో, ఆ వ్యక్తి బ్రతికినంతకాలం హృదయవేదనతో కుంచపడుతూ బ్రతుకవలసివస్తుంది. అతను సుఖాన్ని ఆనందాన్ని అనుభవించటానికి బదులు ఒక వ్యక్తి తనకు భార్య అవ్వటంవల్లనేగదా ఆమె ఉజ్జ్వల భవిష్యత్తు, యిలా అయ్యిందని, నిన్ను చూస్తున్న ప్రతిక్షణం, బాధతో, దోషిగా బ్రతుకవలసివస్తుంది. మనజీవితాలను నరకప్రాయంగా చేసినదానవవుతావు. తప్పక వెళ్ళిరా పారూ. నీవు యీసారికూడ నామాట కాదనకు." ఇలా ఎన్నో చెప్పి, నన్ను అమెరికా పంపించాడు రాము.

నేను అమెరికా వెళ్ళిన ఒక సంవత్సరం తరువాత, చంద్రంకూడ, నేనున్న యూనివర్సిటీకి అమెరికా వచ్చాడు. "ఇలా ఎందుకు జరుగుతుందో?" అని అనుమానం నాకు ఆనాడు లేకపోలేదు. "అలా ఎందుకు జరిగిందో?" అనికూడ నేను అనుకొంటూవుంటాను, "ఎందుకైనా" అని యిప్పుడనిపిస్తూ వుంటుంది. అతను అక్కడకు రావటంకూడ చాల గమ్మత్తుగానే జరిగింది. అతనికి నేనున్న చోటకే రావాలనే ఉద్దేశ్యం వున్నదో, లేదో, అప్పటికీ, యిప్పటికీ నాకు తెలియదు. అతను నేను చదువుతూవున్న యూనివర్సిటీకే దరఖాస్తు పంపినప్పుడు, మా ప్రొఫెసర్ నన్ను చంద్రం నాకు తెలుసునా అని, బాగా చదువుతాడా అని అడిగారు. నేనుగనుక చంద్రం తగినవాడు కాదనివుంటే అతను అక్కడ రావటం జరిగేది కాదు. జీవితంలో యింత సంఘటన జరిగేదికూడ కాదు. కాని నేనలా చెప్పలేకపోయాను. ఆ ప్రొఫెసర్ నేనంటే ఎంతో అభిమానం చూపేవారు. ఎలాగయితేనేమి చంద్రంకు అడ్మిషన్ స్కాలర్‌షిప్‌కూడ యిచ్చారు. నేనే, అతనికి నేనుండే యింటికి దగ్గరలో వున్న యింటిలో ఒక రూము మాట్లాడి అన్ని ఏర్పాటులూ చేశాను. అతను వచ్చినప్పుడు నేనూ, మా ప్రొఫెసర్ అతనిని తీసుకొని రావటానికి విమానాశ్రయానికి వెళ్ళాముకూడాను

చంద్రానికీ, నాకూ సంబంధం ఏమిటని నిక్కచ్చిగా ఎవ్వరడిగినా "ఏమీ లేదు" అని వెంటనే సమాధానం ఆనాడూ చెప్పివుండేదాన్ని. ఈనాడూ చెప్పగలను. చంద్రం సరిపడ్డ లావు, సరిపడ్డ పొడుగు కలిగి చాల ఆకర్షణీయంగా వుంటాడు. చదువు సంధ్యలలో కూడ చాల తెలివితేటలు గలవాడుకూడాను. ఎప్పుడూ సరదాగా నవ్వుతూ వుంటాడు. కాని ఆ నవ్వు వెనుక యితరులు అంతంతమాత్రంగా అర్థం చేసుకొనలేని బాధ వుందని నాకనిపిస్తూవుండేది. ఎవరైనా, అతనెప్పుడూ నవ్వుతూవుండటం గూర్చి ఏదైనా అంటే "అసలే యీ జీవితకాలం కొద్ది అనుకొంటూ వుంటే, ఆ కాస్తా ఏడుస్తూనే గడిపితే చివరకు మిగిలేదేముంది? అయినా అందరిముందూ ఎప్పుడూ ఏడుస్తూ కూర్చొనే శక్తి నాలో లేదు. నిద్ర పోయేముందు ఆవురుమని కాసేపు ఏడ్చి, బరువు తీరగనే హాయిగా నిద్రపోతే పోలా?" అని ఏదో చెప్పుకొనిపోతూ వుండేవాడు.

చంద్రం తెలివిగలవాడు, సహృదయుడు, చాల మంచివాడు అని మట్టుకే నాకు తెలుసును. అతనంటే నాకే యితర అభిప్రాయమూ లేదు. అతని గతం

పూర్తిగా నాకు తెలియదు. నా విషయాలు, నా సంసారంగూర్చి అతనికి పూర్తిగానే తెల్సును. అలాంటప్పుడు, నేనంటే మరొక రకమైన అభిప్రాయం వుంటుందనిగాని, నన్ను కోరతాడనిగాని నేను అనుకోను. అమెరికాలోకూడ, నేనూ, చంద్రం, ఎలాంటి వేరు ఆలోచనలు లేక స్నేహితులా రెండు సంవత్సరాలు గడిపాము.

నేను భారతదేశానికి తిరిగి వచ్చేటప్పటికి, మా యిద్దరిని గూర్చి చిలువలు, పలువలుగా చెప్పుకొంటున్న కథలు విన్నప్పుడు, తల పగులకొట్టుకొని చచ్చిపోదామా అనిపించింది. వీళ్ళందరకు యింత ఉక్రోషం, ఓర్వలేనితనం ఎందుకో నా కర్థంగాదు. ఇద్దరం స్నేహంగా వున్నంతమాత్రాన ముక్కూ, మొఖం ఎరుగని, మమ్ముగూర్చి అలా గుసగుసలుగా ఎందుకు చెప్పుకోనవల్సివచ్చిందో!

నేను అమెరికాలో వుండగానే, ఇచ్చట ఉద్యోగం వచ్చింది. దానికి నేను ఒప్పుకోనబోయే ముందు కూడ, రాముకు యిష్టంలేకుండా చేయటం, నాకు యిష్టంలేదు. రాము తన మామూలు ధోరణిలోనే, నిశ్చింతగా ఉద్యోగానికి యిష్టపడమని, అది చాల మంచి ఉద్యోగమని, అలాంటిది దొరకటం చాల అదృష్టమని, అసలు కావాలనుకొన్నప్పుడు భారతదేశంలో ఉద్యోగం దొరకటం ఎంత కష్టమో, మొదలగు విషయాలు వ్రాస్తూ, నన్ను మరొక ఆలోచన లేకుండా ఉద్యోగానికి అంగీకరించమని వ్రాశాడు.

రాము కూడ తరువాత నాతో వస్తాడని, తరువాత, నెమ్మదిమీద అతనికి కూడ ఉద్యోగం అక్కడనే దొరుకుతుందని, అసలతను ఉద్యోగం చేయకపోయినా అంత బాధ లేదని భవిష్యత్తుని గూర్చి కలలుగంటూ ఉద్యోగానికి అంగీకరించాను. నేను ఏపని చేసినా, సర్వత్యాగంచేసి, నన్నొక వ్యక్తిగా తయారుచేసిన రాముని దృష్టిలో పెట్టుకొని, మా భవిష్యత్తును గూర్చి కలలుకంటూనే చేశాను యింతవరకు. కాని నా అదృష్టం వేరుగా వుందనిగాని, యిలా మరువలేని సంఘటనకు దారితీస్తుందనిగాని, భరించలేని వ్యాకులవేదనతో, బాధతో బ్రతుకవలసి వస్తుందనిగాని నేను కలలో కూడ తలంచలేదు. అందుకూ నా అదృష్టాన్ని గూర్చి కొనియాడుతూ వుంటే, నిజంగా నాకు రాములాంటి భర్త దొరకినందులకు అలాంటి దేవతకు నేను భార్యనైనందుకు ఎంతో గర్విస్తూ వుండేదాన్ని. సర్వం నా పాదాలవద్ద పడినట్లుగా కలలుగంటూ గడుపుతూ వుండేదానను. కన్నతండ్రిని చూడ నోచుకొనక పోయినా, ఆదరాభిమానాలతో కనిపెంచిన కన్నతల్లి దూరమయినా అనాథగా పెరిగాననే విచారాన్నే రాముని చూచుకొని మర్చిపోయాను. నా సర్వస్వం నా రాము. అదే నా అదృష్టం. అందుకు నేను సగర్వంగా వుంటూవుండేదానను. ఈ లోకంలో నాకు నిజానికి ఏమి తక్కువ అనుకొంటూవుండేదానను. చాలమంది ఆశించినా రాని ఉద్యోగం నా కాళ్ళ దగ్గరకు వచ్చింది, ఎవ్వరూ పొందలేని, నిష్కల్మష సద్గుణసంపత్తిగల భర్తను నేను పొందగలిగాను, ఎవ్వరూ ఊహించలేని యీ స్థితికి, ఆ స్థితినుండి రాగలిగాను, యీ అంతస్థుకు చేరుకున్నా, నాకు తక్కువేమిటి? ఇంకా నాకు కావల్సిందేముంది? అలాంటి ఆలోచనలతో ఆఖరిరోజులు అమెరికాలో గడపుతూ వుండేదానను. రాముని వదలివెళ్ళి మూడు సంత్సరాలయ్యింది. నిజంగా సమాజం అతనినిగూర్చి ఏమనుకొంటూవుంటుందో, నన్ను గూర్చి ఏమి చెప్పుకొంటూ వుంటుందో! అబ్బ! ఎలాంటి కృత్రిమ సమాజం అంటేను. అసలా సమాజంలో రాముని అర్థంచేసుకొనగలవాళ్ళు ఎవ్వరైనా వుంటారా అని నా అనుమానం. ఎవరేమి అనుకొంటే మాకేమిటి? మా జీవితం ఆనందమయిం, మా సంసారం స్వర్గతుల్యం—యిలా ఎన్నో తలంపులు కల్గుతూయుండేవి. నిద్రపట్టేది గాదు, ఆహారం సహించేది గదు, ఒకొక్కరోజు, సంవత్సరంలా గడుపుతూ ఉన్నట్లుగావుండేది.

ఎలాగయితేనేమి ఆసుదినం వచ్చింది. నేను రాము వద్దకు చేరాను. రామునిచూచినక్షణం, మేముయిద్దరం, కన్నీటితో మాట్లాడుకొనలేకపోయిన క్షణం, ఎనాటికి నేను మరువలేను. అలాంటి ఆనందకరమైనక్షణం, మరొకసారి రాగూడదూ? ఒక్కసారి అంటే ఒక్కసారి. నాజీవిత సర్వస్వం దానికి యిచ్చివేస్తాను.

ఒక నెలతరువాత ఉద్యోగంలో చేరటానికి అనుమతి యివ్వటంవల్ల, ఆ నెలరోజులు నేనూ, రామూ ఒక్కచోటే గడిపాము. వచ్చేపోయేచుట్టాలు, స్నేహితులవల్ల మేము ఎక్కువ విషయాలు ఎక్కువకాలం, సాకల్యంగా మాట్లాడుకొనటానికి అవకాశం లేకపోయింది. వున్న కొద్దికాలంలో రాము అడిగినదానికి కచ్చితంగా సమాధానం చెప్పేవాడుగాదు. అతను కూడ నాతో పాటు రావటంగూర్చి చాలసార్లు

అడిగాను. "అట్లాగేలే. చూద్దాము. ఇప్పుడు తొందరేముంది?" ఇలా ముక్తసరిగా సమాధానాలు యిస్తూ వుండేవారు. అతనిని కచ్చితంగా చెప్పమని, నిలవేసి అడిగే ధైర్యం, శక్తి, నాలో లేకపోయాయి. ఇకనైనా రాముకు దూరంగా వుండకూడదనుకొన్నా. రాముకు నాతోపాటు తీసుకెళ్లాలని ఆతురపడుతూ వుండేదానను. అతను నావెంట రానిపక్షంలో ఏమిచేయాలి అని అప్పుడప్పుడు ఆలోచించుకొంటూ వుండేదానను. కాని నామట్టుకు ఉద్యోగంచేయకుండా యింటివద్ద కూర్చొనటం ఏమాత్రమూ యిష్టంలేదు. ఈ నాకోరిక రాము బలానికి తోడు నేను ఉద్యోగానికి అంగీకరించటానికి బలీయమైన కారణం కూడాను. రాము సంఘసంస్కర్తగా పేరొందాలనిమట్టుకు నన్ను నదిలించి వుండడు. అలాంటి స్వార్థం అతనిలో వుండకొనటం చాల పాపకరమైన విషయం. కాని అతని మనస్సులోని ఉద్దేశ్యం ఆనాడు విషయస్సి ఎప్పుడూ బయటను చెప్పలేదు. అసలతను ఎప్పుడూ అంతే. ఎవరైనా తనను ఏదైనాఅన్నా నవ్వి వూరుకొంటాడు. లేకపోతే అచ్చటనుండి లేచి వెళ్ళిపోతాడు. నా తెలివితేటలుపయోగించి, అతని మనోభావాన్ని తెల్సుకొనాలని స్నేహితురాలుగా, భాగస్వామినిగా, అనురాగవతిగా, ఎంతో ప్రయత్నించాను. కాని ఫలితం శూన్యం. ఓటమిని అంగీకరించవల్సి వచ్చేది. అతని మౌనోమునకు చాల బాధపడుతూ వుండేదానను. "దేవుడా ఎందుకు ఈ మౌనస్వామిని ప్రసాదించావు." అని కోపంతో నాలో నేను అనుకొని, తిరువాత పశ్చాత్తాపపడేదానను. అలా ఆనెల అనుకొన్నంతగా ఆశించినంత అనురాగ ఆనందాలతో గడుపలేకపోయాను. రాముతో ముఖాముఖీగా మాట్లాడలేకపోయేదానను. తిరువాత నెమ్మదిగా ఒకటి రెండు నెలలలో వస్తాడనే నమ్మకంతో అతను సహజమైన చిరునవ్వుతో సాగనంపగా వెళ్ళి ఉద్యోగంలో చేరాను.

నన్నూ, చంద్రంనుగూర్చి రాముమనస్సులో ఏముందోగాని, వూళ్ళోనట్టుకు గుస గుసలు సాగుతూనే వున్నాయి. నా చెవివరకు వచ్చాయి. అందుకే, యీ కృత్రిమ, అసూయా, ద్వేష జుష్టమైన సమాజంనుండి రాముని లాక్కొని పోయి బయటపడాలనియు తహ తహ లాడుతూ వుండేదానను. నేను ఎంతో యీ సమాజానికి దూరంగావున్నా, రాము వాళ్ళందరిమధ్య, వాళ్ళందరూ, పికపికలు పకపకలతో, చాటుగా మాటుగా ఎగతాళిచేస్తూ, మాటలు అంటూవుంటే, బ్రతకటం నాకు ఏ మాత్రం యిష్టం లేదు. అనేకరాత్రిళ్ళు ఏడుస్తూ గడిపేదానను. రాము బాధలన్నిటికి నేను కారణంగా బాధపడుతూ వుండేదాన్ని. అందువల్లనే నా బాధనంతా వెలిబుచ్చుతూ, రామును నేను వున్నచోటకు రమ్మనమని, ఎంతగానో ప్రాధేయపడుతూ ఉత్తరాలు వ్రాస్తూ వుండేదానను. కాని అతనుమట్టుకు, మౌనీభావంతో, ముక్తసరిగా, తనకేమీ పట్టనట్లుగా, తానేమీ ఎరుగనట్లుగా, నిశ్చింతగా, నిష్కల్మషంగా, నా యోగక్షేమాలను గూర్చి అడుగుతూ, ఆరోగ్యాన్నిగూర్చి జాగ్రత్త తీసుకొనమని సలహాలిస్తూ, జవాబులు వ్రాస్తూ వుండేవాడు.

అలా రెండు నెలలుపైగా గడచింది. చంద్రం కూడ, ఢిల్లీ వస్తున్నట్లు, ఉద్యోగం ఖాయమయ్యినట్లు వార్తలు వచ్చాయి. ఆ విషయంకూడ నా కంటే ముందు, రాముకు చంద్రంద్వారా తెలిసినది. రాము నాకు వ్రాశాడు.

ఇలా బరువుగా కాలం గడుస్తూవున్న సమయంలో, ఒక శనివారంనాడు రాము వ్రాసిన ఉత్తరం నాకు చేరింది.

"ప్రియమైన పారూ, క్షేమమే గదూ. నేను ఇచ్చట క్షేమముగానే వున్నాను. నీ ఆరోగ్యంగూర్చి జాగ్రత్త తీసుకో. దాదాపు 10 రోజుల క్రితం ఒక వ్యక్తి మనయింటికి వచ్చాడు. మీ నాన్ననని చెప్పాడు. కాని పారూ, చాల అసభ్యంగా ప్రవర్తించాడు. నన్ను అనరాని మాటలన్నాడు. ఆపదానికి కొమ్ములు తెచ్చి, పగులు వదలివ నటనన్నాడు. వత్తిపద్దమ్మ క్రింద జనుకట్టి యిష్టంవచ్చినట్లు తూలనాడాడు. ఫర్వాలేదు పారూ. ఏదో అజ్ఞానంవల్ల అలా మాట్లాడి వుంటాడు పాపం చాల చిక్కిపోయి వున్నాడు. నాకు ఎప్పుడూ చూసిన గుర్తులేదు. కాని ఎలా అయినా మామగారుగా! చాల మర్యాద చేసి పంపాను. ఖర్చిపోయా. నీ అడ్రసుకూడ తీసుకొన్నాడు. బహుశ యీపాటికి నీవద్దకువచ్చి వుండవచ్చు. మానవజీవితాన్ని నాశనంచేయుటం చాల తేలిక, వికసింపచేయుటం చాల కష్టం. పాపం అతని బాధలేమిటో ఎవరికి తెల్సు?

"నేను ఒక విషయం నీకు చాలకాలంనుండి వ్రాయాలనుకొంటున్నా. చాలకష్టం కూడాను వ్రాయటం. నీకూ చాల కష్టంగానే వుంటుంది. సవ్యంగా ఆలోచించటం, ఆవేశాలకు ఆహుతిగాకుండా వుండటం విజ్ఞానుల లక్షణం. నీవు ఎంతో చదువుకొన్న దానివి. నీకు అవి అన్నీ చెప్పటం చాల హాస్యాస్పదంగాకూడ వుంటుంది.

"పారూ, నిన్ను చిన్నప్పటినుండి ఎరుగుదును. నీకు చిన్నతనంనుండీ, చదువు అంటే ఎంతో అభిలాష వుండేదని నాకు తెలుసు. ఆ నీ కోరిక నెరవేరటం అంత తేలికకాదని కూడా నాకు తెలుసు. గుర్తుందా పారూ, మనయిద్దరం కలిసి ఎన్నో నవలలు చదువుతూ వుండేవాళ్ళం. అప్పుడప్పుడు నీవు, చదువుకొని ముందుకొచ్చే అవకాశం నీకు లేదని ఎంతో యిదిగా నాతో అంటూ వుండేదానవు. ఏనాడో, నాకుగనుక అవకాశంవుంటే నీకా అవకాశాన్ని కల్పించాలనుకొన్నా. ఆ చిన్ననాటి నా కోరిక యీనాడు ఫలించింది. నిజానికి నేనెంతో గర్వపడుతున్నా.

"ఒక్క విషయం. నేను ఎంతో త్యాగం చేశానని అనుకొన్నా, తన్నుతాను మోసపుచ్చుకొనటమేగాక, ఇతరులను మోసపుచ్చటం అవుతుంది. నా చిన్ననాటి ముచ్చటను, కోరికను తీర్చుకొన్న స్వార్థపరుడిని మాత్రమే నేను. నేను త్యాగినిగాను, సంఘసంస్కర్తనూగాను, నన్నెప్పుడూ అలా అపార్థం చేసుకోనకు పారూ.

"అసలు విషయం నేను నీతో ఉండటానికి ఢిల్లీ రావటం జరగనిపని. నీతో వచ్చి ఉండటానికి నా కేమాత్రమూ ఇష్టంలేదుకూడాను. ఇన్నాళ్ళూ ఆలోచించుకొని, మనస్సులోని మాటను నీకు వ్రాయదల్చుకొన్నా. నీవుకూడ అదేవిధంగా ఈ విషయాన్ని తీసుకొనగలవని నమ్ముతున్నా. నీవు చంద్రాన్ని వివాహమాడి సుఖపడాలని మనఃపూర్తిగా, నిష్కల్మష హృదయంతో కోరుతున్నాను. నీకు అలాంటి శక్తిసామర్థ్యాలు, మనోధైర్యం కల్గాలని దేవుని ప్రార్థిస్తున్నాను. ఖంగారుపడకు పారూ. విచారించకు. నేనీ విషయాన్ని ఏనాడో చెప్పదల్చుకున్నా. కాని అవకాశం లేకపోవటంవల్లనైతేనేమి, చెప్పలేకపోవటంవల్లనైతేనేమి ఇంతవరకు చెప్పటం జరగలేదు.

"ఎందుకు పారూ, ఆలోచన, విచారం, ఆకంగారూను. అతను నీకు అన్నివిధాల తగినవాడు. విజ్ఞానంలోనైతేనేమి, యోగ్యతలలోనైతేనేమి మీరు ఇద్దరే ఒకరికి మరొకరు సాటి.

"నేను నిన్ను తప్పుగా అర్థం చేసుకొన్నానని అనుకోకు పారూ. నాలో రక్తం ప్రవహిస్తున్నంతవరకు అలాంటిది జరుగదు. నీపై నాకు ఎంతో విశ్వాసం, గౌరవం వున్నది. అందువల్ల ఇంతకాలం యిలా వుండగల్గాను. ఇక సమాజం అంటావా — నీవేమీ భయపడవల్సిన పనిలేదు. కాసేపు కాకిగోల చేస్తుంది. ఆ తరువాత అదే నోరు మూస్తుంది. దాని గోలకు నీవేమీ భయపడటంగాని, కించపడటంగాని, విలువ కట్టటంగాని జరుగనప్పుడు, ఓటమిని అంగీకరించి, తప్పుకొనటంకన్న అది చేయగల్గిందేముంది? ఎవరో ఏదో అనుకొంటారని, వ్యక్తిగత వాంఛలను, సుఖాలను చంపుకొనేవారిని బలహీనులనాలి. అలాంటి బలహీనత నీలో లేదనే నా నమ్మకం.

"నేను చంద్రంతోకూడా యీ విషయం యింతవరకు ముచ్చటించలేదు. అతనుకూడ ఢిల్లీ వస్తున్నట్లు, నిన్న వచ్చిన ఉత్తరంలో వ్రాశాడు. కాలంకూడ మిమ్ములను అలాగే దగ్గరకు చేరుస్తూ వుంది. కాదనకు పారూ. అతను నా తమ్ముడిలాంటివాడు. నీవు అంగీకరించితే, నేను చంద్రాన్ని వ్రాసి ఒప్పిస్తాను.

"ఏమంటావు పారూ!

"తప్పక సరేనంటావు గదూ? — రాము"

అవే నేను ఆఫీసునుండి తిరిగి వచ్చేటప్పటికి, నాకోరకు ఎదురుచూస్తూవున్న రాము వ్రాసిన ఉత్తరంలోని విశేషాలు; ముచ్చట్లు; ఇన్నాళ్ళనుండి మూకీభావంగా వుండి, అందచేసిన చల్లని కబుర్లు.

ఆ ఉత్తరం ఎలా చదువగలిగానో నాకే తెలియదు. త్రాగినవానివలె నా బుర్ర తిరిగిపోయింది. ఆ రాత్రంతా ఎలా ఏడ్చానో భగవంతునికే తెలియాలి. నా అదృష్టం సంగతి నాకు తెల్సివచ్చింది. నా గర్వం అణగిపోయింది. నా జీవితానికి సుఖంలేదా, ప్రశాంతంగా బ్రతికే అవకాశమే లేదా - ఆ రాత్రంతా ఎలా గడచిపోయిందో చెప్పలేను.

ఉదయం లేచేటప్పటికి ఎంతో నీరసంగా వున్నట్లు తలంచాను. అలా ఏడుస్తూనే కాఫీ తీసుకొంటూ వుండగా, ఎవరినో, ఒక బక్క చిక్కిన వ్యక్తిని, పనిమనిషి లోపలకు తీసుకొని వచ్చింది. నేను కూర్చోపెట్టమని చెప్పి, ముఖం కడుక్కొచ్చాను. అతనే మానాన్న అంట. నేను

ఏమీ మాట్లాడలేదు. మాట్లాడగల స్థితిలో కూడ లేను. అతనువున్న గంటా అతనే చెప్పుకుపోయాడు. అతని వంశ గౌరవ మర్యాదలు, పేరు ప్రఖ్యాతులు మంట కలుపుతున్నానన్నాడు. అతను నలుగురిలో తల ఎత్తుకొని తిరుగలేకుండా వున్నాడట. అందువల్ల నేను బ్రతికేకంటే చావటం మేలని సలహాయిచ్చాడు. అలా నోటికివచ్చినట్లు ఏమో అన్నాడు. చివరకు బెదిరించి మరీ వెళ్లాడు.

కనీసం కాఫీ అయినా తీసుకొంటాడేమో అడగ లేకపోయాను. కన్న తండ్రిని భోజనానికి వుండమని అనే శక్తికూడ నాకు ఆనాడు లేదు. అలాంటిఅదృష్టం, యోగ్యత, నాకు లేవనుకొన్నాను. ఒకవేళ నేను భోజనానికి వుండమన్నా" ఛీ, నీకొంపలో నా?" అంటాడేమోనని భయ డ్డాకూడ.

నేనూ వ్యక్తినే, నాకూ ఊహలుంటాయి. వీళ్ళెవరు నాకు ఆదేశించటానికి, నా జీవితగమ్యాన్ని గూర్చి జీవితబోధలు చేయటానికి, నాకు త్రోవ చూపటానికను? ఒకరు కళ్లురిమి, తప్పు అంటున్నారు. మరొకరు ఎంతో సౌమ్యంగా, సాధుమూర్తిలా ఉద్బోధిస్తున్నారు. వ్యక్తిగత సమస్యలను సమాజదృష్టిలో ఆలోచించి నిర్ణయానికి వసున్నారు. నా తండ్రి మాటకు నే నెప్పుడూ విలువకటలేదు. అలాకట్టాననుకొనటం చాల పొరపాటు అసలతనెవరు? నాకు తండ్రిఅనేవ్యక్తి లేడనేచెప్పాలి. తల్లైనా, తండ్రైనా అష్టకష్టాలుపడి పెంచి, పెద్దవానినిగా చేసినది అమ్మే. ఈనాడు ఆమె ఆసరాకూడ నేను నోచుకొనలేదు. రామునానికి రాము చెప్పేదిముట్టుకు ఏమిటట? వ్యక్తిగా బ్రతికగల్గటం, వ్యక్తిగా ఆలోచించటం నేర్చుకొనమంటున్నాడు. అవును. అది నిజమే. అతనికి నాతో సంసారం చేయటానికి యిష్టంలేకపోతే, లేదని చెప్పడంవరకే అతనికి హక్కుంది. అది అతనివ్యక్తిగత మైనసమస్య. కాని ఫలానివారిని పెండ్లాడమని ఉద్బోధించటానికి, అతను హక్కు భుక్తాలు ఎక్కడనుండి తెచ్చిపుచ్చుకొన్నాడో నాకు తెలియకుండా వుంది. నాల్గురోజులపాటయినా సంసారంచేయటానికి వీలు లేకుండా చదువని, వేడినీళ్ళకు చన్నీళ్ళు తోడవుతాయని, ఉజ్జ్వలానంద భవిష్యత్తుముందుందని కలలు గంటూ, ఉవ్విళ్ళూరుతూ గడుపుకొంటూ వచ్చాను. ఆడదంటె అజ్ఞానినిగా, నిస్సహాయురాలుగా తలంచి రాము యింతె నాటకం ఆడివుండవచ్చు. అతనిపై ప్రేమ వల్లనైతే నేమి, గౌరవాదరాభిమానాలవల్లనైతే నేమి, అతనే సర్వం అని, అంతకన్నా నాకు దిక్కు మొక్కూ లేదనటుగా గ్రుడ్డిగా నమ్మాను. ప్రతిదానికి ఊగొడుతూ, చెప్పినదల్లా చేశాను. అతని హృదయం లో అలాంటి భావనలున్నాయని గాని, నేనంటే అలాంటి ఉద్దేశ్యంవుందని గాని అలాంటి అనుమానం నాపై అతనికివుందని గాని గ్రహించలేకపోయాను, కనీసం ఊహించనైనా వూహించలేకపోయాను.

మోసం బయలిపడ్డయింది. రాము ఉత్తరం నాకళ్ళు తెరపించింది. చంద్రం. నేనూ ఒకే క్లాసులో వుండి చదువుకొన్నంతమాత్రాన, అతను ఇంటికివస్తూ-పోతూ వున్నంతమాత్రాన, చదువుకొని విజ్ఞానవంతుడననుకొనే రాము, నన్ను యిలా అపార్థం చేసుకొంటాడనుకోలేదు. నాకు ఆవేశం ఎక్కువవుతూవుంది. ఆవురుమని ఏడ్వాలనిపించింది. చచ్చిపోతే సమస్యే తీరిపోయిందనుకొన్నాను. కాని అలాంటి పని చేయటంకన్న హేయమైనది మరొకటి లేదనుకొని, రాముతో ముఖాముఖీగా మాట్లాడి అతను నాతోపాటు రావటమో, నేను ఉద్యోగం వదులుకొని అతనితోపాటు ఉండటమో, అతను నన్ను కాదనటమో, అసలతని వుద్దేశ్యం ఏమిటో వెళ్ళి తెలుసుకొన నిశ్చయించుకొన్నా. నా హృదయపు ఆరాటం ఎక్కువవుతూవుంది. రాముపై అనుమానంకూడ పెరిగిపోతూనే వుంది. అసలతనొక సంఘసంస్కర్తననిపించుకొని, కుటుంబాన్ని త్యాగంచేసిన మహానుభావుడుగా తయారయి అందరితోను జేజేలు కొట్టించుకొంటూ, ఊరేగుతూ వుండాలనో, మహానాయకుడుగా వెలుగొందాలనో అతని ఉద్దేశ్యమేమో! అబ్బ! మానవులు ఎంత కర్కోటకులో! తమ పేరు ప్రఖ్యాతులకొరకు, స్వార్థంకొరకు ఎంతపనికైనా తయారవుతారనుకొంటా అవును నిజమే. ఆనాడు మానాన్న అలాగే చేశాడు. ఈనాడు రాము యీ ముసుగుతో ఇలా తయారయ్యాడు. భేదం ఏముంది? ఒకళ్ళు సంఘసంస్కర్తలు, మరొకరు బ్రతికినన్నాళ్లు అజ్ఞాతవాసిగనే బ్రతుకుతున్నారు. కాని ఇద్దరి గమ్యమూ ఒక్కటే - అలాంటి ఆలోచనలతో నాలో హేయభావం పెరిగిపోతూవుంది. మానవజీవితంపై రోతపుట్టింది.

అలా ఎన్నో భావనలతో, ఉద్దేశ్యాలతో, అనుమానాలతో ఇంటికి ప్రయాణం అయ్యాను. త్రోవలో నాలో నేను ఎంత ఏడ్చానో ఎవరికీ తెలియదు. నా ఆశలు నిరాశలవుతాయనిగాని, కలలుకన్న భవిష్యత్తు అలా కూలిపోతుందనిగాని ఊహించలేకపోయాను. హృదయగా వేదనతో శవాకారంగా ఇంటికి చేరాను. రాము ఆఫీసుకు వెళ్లాడు. వంటబ్బాయి సాయంకాలం వంట చేయటానికి తయారవుతూ వున్నాడు. నన్ను చూడగనే ఆశ్చర్యపొయ్యాడు. ఇంట్లో కాలు పెట్టినప్పటినుండి రాము దినచర్యనుగూర్చి—అప్పుడు

బయటకు వెళ్ళుతాను, ఎప్పుడు రాత్రిళ్ళు తిరిగివస్తాడు, ఎప్పుడైనా ఇంకెవరైనా వస్తూవుంటారా మొదలైన ప్రశ్నలు. నా అనుమానపు హృదయం బయటపడకుండా వేశాను. అన్నిటికి జవాబు మామూలుగానే ఇచ్చిన వంటబ్బాయి ఎందుకడిగాడో గాని "ఏమమ్మా అలా అడుగుతున్నారు. వంట్లో కులాసాగా లేదా? ఉత్తరంకూడ వ్రాసినట్లులేదు. అయ్యగారు కూడ ఎప్పుడూ అనలేదు." అన్నాడు. ఏడ్పును ఆపుకొనలేక, వెంటనే స్నానాల గదిలోనికి వెళ్ళి, బట్టలు మార్చుకొని, నేనే వంటచేసి, రాముకోసం ఎదురుచూస్తూ ఎన్నో ఆలోచనలతో సతమతమవుతూ కూర్చొన్నా.

క్లబ్బునుండి ఆలస్యంగా తిరిగివచ్చిన రాము, కళ్ళుమూసుకొని, కుర్చీలో పడుకొనివున్న నన్ను చూసి చాల ఆశ్చర్యపడి వుండాలి. అతని మనస్సులో నన్ను చూసినప్పుడు ఎలాంటి భావన కల్గిందో నాకు తెలియదు. ఒక వ్యక్తిని ఎదురుతిరిగి కొటలేని పిరికిపందగా, అసమర్థునిగా తలంచి కొట్టినప్పుడు, దెబ్బతిన్నవ్యక్తి, చేయిఎత్తి కొట్టడానికి వచ్చినప్పుడు మొదటి వ్యక్తి ఎలా ఆశ్చర్యపడతాడో, ఎలా ఒక అడుగు వెనుకకు వేస్తాడో, అలాగే రాముకూడ చేసివుండవచ్చు. కళ్ళుమూసుకొనివున్న నేను అది ఏమీ గమనించక పోయాను.

"ఎప్పుడు వచ్చావు పారూ?" అనే అతని పరిచయపు, మర్యాద కుశలప్రశ్నతో త్రుళ్ళిపడి లేచాను.

నారాము, నా ఎదురుగా కన్పించగానే, నాలో పూర్వంవున్న ఆగాటం, కోపం అన్ని చల్లారిపోయాయి. చాల చిక్కిపోయాడు రాము. అతని కాళ్ళపైబడి నాతప్పును క్షమించమని కోరాలనిపించింది. ఒకరినొకరం కుశలప్రశ్నలు వేసుకొన్నతరువాత, రాముకూడ వెళ్ళి స్నానంచేసి వచ్చాడు. భోజనానికి కూర్చొన్నాము. కాని ఎవ్వరూ ఎక్కువగా మాట్లాడలేదు. ఎవరు మాట్లాడాలి, ఎలా సంభాషణను మొదలుపెట్టి, సాగించాలి అనే సందిగ్ధంలో వున్నాము. మల్లయుద్ధానికి తయ్యారయి, ఎవరు ముందు కలుగచేసుకొంటారు అన్నట్లుగా వుంది మా పరిస్థితి. నిజానికి రాముకూడ నేను యిలా వస్తానని అనుకొని వుండడు. నేను పూర్వంలాంటి వ్యక్తి ననుకొని, చెప్పితే వినేస్వభావం గలదాన్నని అనుకొని వుంటాడు. అసలు నన్ను పరీక్షింపదల్చి యిలా చేసివుంటాడేమో! ఏమయినా నేనే ఏదో ఒకటి తేల్చుకోవాలి. ఇద్దరం ఏమయినాసరే ఒక్కచోటనే వుండాలి. కాని పిల్లి మెడలో గంట కట్టే దెవరు?

మా భోజనాలయినాయి. నేను ప్రక్కలు పరిచేసేటప్పటికి, వంటబ్బాయి ఎవరింటికో వెళ్ళాలని చెప్పి వెళ్ళాడు. నేను వచ్చి రాముకు ఎదురుగా ఆ వెన్నెలలో కూర్చొన్నాను. అలా వెన్నెలరాత్రులలో, చందమామతో చెలగాటాలాడుతూ, ఆనంద డోలికలలో, అనురాగమయ జీవితాన్ని గడపాలనుకొన్న నేను, నా దుస్థితిని, అసహాయతను, తెల్సుకొన్నప్పుడు, దుఃఖాన్ని ఆపుకొనలేకపోయాను. కన్నీళ్ళు కారుతున్నాయి వెక్కి వెక్కి ఏడ్వటం సాగించాను.

"అరె! పారూ ఎందుకలా ఏడుస్తున్నావు?" అని అడిగాడు రాము.

"నా బ్రతుకు..."

"అదిగాదు పారు, అన్నీ తెల్సుకొన్నదానవు, ఎంతో చదువుకున్నదానవు, అలా ఏడ్వటమూ, ఏమిటి కారణం పారూ?"

"అవును ఇన్నాళ్ళనుండి నా విజ్ఞానాన్ని తెలివి తేటలను కొనియాడుతూ, యింతవరకు తీసుకొని వచ్చారు...దయాదాక్షిణ్యాలు లేకుండా అలా ఉత్తరం వ్రాశారు."

"అదా సంగతి పారూ!"

"అవును. మీకు అంతా, అంత తేలికగా వుంటుంది. పేరుప్రఖ్యాతులకొరకు ప్రాకులాడేవాళ్ళతోటి మానవ హృదయాన్ని ఎలా అర్థం చేసుకొనగల్గుతారు. తేనె పూసిన కత్తులలా మానవులు మాట్లాడుతారని, తడిగుడ్డలతో గొంతులు కోస్తారని తెల్సుకొనలేకపోయాను." అన్నాను దుఃఖాన్ని బిగపట్టుకొని, ఆవేశంతో, పట్టరాని ఉక్రోషంతో.

"ఏమంటున్నావు పారూ? ఏమిటిది అంతా?"

"ఏమీ తెలియదు పాపం మీకు. సంఘ సంస్కర్తలు గదూ!"

"నన్ను అపార్థం చేసుకొన్నావు పారూ."

ఇంతలో ఎవ్వరో తలుపు కొట్టారు. నేను వెంటనే కళ్ళు తుడుచుకొన్నాను. యిద్దరం అటు చూశాము. చంద్రం తన సహజమైన నవ్వుతో ప్రత్యక్షం అయ్యాడు.

చంద్రం అమెరికానుండి తిరిగివచ్చి దాదాపు 10 రోజు లవుతుంది. ఇంత తొందరగా మా యిద్దరిని చూడటానికి వస్తాడని మేము ఎవ్వరమూ అనుకొనలేదు. నేను ఢిల్లీలోనే వుంటానని, రాముని కష్టపెట్టటం యిష్టంలేకపోవటంవల్ల హోటలులో దిగానని చెప్పాడు.

"అరె! పారూ, నీవుకూడ యిక్కడనే వుంటావనుకోలేదు. ఎప్పుడు రావటం? అదృష్టం అంటె అలా వుండాలి. మీమధ్యకు పానకంలో పుడకలావచ్చి డిస్టర్బ్ చేస్తున్నందుకు క్షమించాలి. ఏమయినాగాని మీరు నాకోరికను మన్నించుతానంటే, చెబుతా."

"..................."

"అదేమిటి అలా చూస్తున్నారు. ఏదో పెద్ద సమస్యా పరిష్కారంలో వున్నట్లుంది వ్యవహారం. అంతర్జాతీయ సమస్యా! లేక కొంపతీసి, గృహకల్లోల సంగ్రామములో రాజీకి కూర్చొనలేదుగదా! ఏమిటి?"

"ఏమీ లేదు చంద్రం, నీవు అనుకోనకుండా వచ్చావు. అంతకన్న ఆశ్చర్యపడవల్సిం దేముంది?" అన్నాడు రాము.

"నేను చాల అర్జంటు పనిమీద వచ్చాను. మీరు నన్ను నిరుత్సాహపరచరనుకొంటాను. వచ్చేవారం యీ రోజున నే నా వివాహం. మీరు యిద్దరూ తప్పక రావాలి. సరేనా? మీరు రాకంటే నే వెళ్ళేదిలేదు."

"వివాహమా! ఇంతవరకుముందు ఎప్పుడూ మాట వరుసకైనా అనలేదే!"

"అనుకోనకుండానే కలిసి వచ్చింది రామూ. అసలు నిజానికి నిన్న నే అనుకొన్నది కూడాను. తప్పక వస్తారుగదూ."

మేము సరేనన్నాము. తరువాత ముగ్గురం కొద్దిసేపు మాట్లాడకుండా కూర్చొన్నాము. సరం చంద్రం మా నిశ్శబ్దానికి, మా కీభావానికి కారణం ఏమిటని చాలబాధగా ఒకటిరెండుసారు అడిగాడు. జవాబు ఎవరో ఒకరు చెప్పాలి. అది నేనుచేయలేనిపని. వాడిపోయిన ముఖంతో, ఇన్సల్ట్ గా ఫీలవుతూ, యీ నాటకంలో ఒకరకమైన పాత్రను నిర్వహించిన వ్యక్తిగా అసలు విషయం రాము చెప్పసాగాడు.

"చంద్రం. నిజంగా నీవు మమ్మలను, మా మాకీభావాన్ని చూసి ఆశ్చర్యపడుతూ వుండవచ్చు. పారుకూడ యీరోజే కనీసం ఉత్తరం అయినా వ్రాయకుండా వచ్చింది. దానికంతటికీ కారణం నేనే. నేను పారూకు, నిన్ను పెండ్లిచేసుకోవమని, తనకు యిష్టమయితే నేను నీతో కూడ మాట్లాడతానని వ్రాశాను!"

"నన్నా..."

"అవును చంద్రం. నా హృదయపూర్వకమైన ఉద్దేశ్యముకూడా అదే. చదువు సంస్థలలోనైతేనేమి, తెలివితేటలలో అయితేనేమి. మీరు యిద్దరూ సమానులు, అనుకూలురు. కయ్యానికైనా, నెయ్యానికైనా సమానత వుండాలిగదూ."

"నన్ను తప్పుగా అర్థంచేసుకొన్నావు రామూ. నన్ను కూర్చి అంతహీనంగా అనుకొంటావని కలలో కూడ తలంచలేదు."

"దానిలో అపార్థం చేసుకోనటం ఏముంది చంద్రం. పారూకూడ నన్ను అపార్థం చేసుకొని, హృదయావేదనను పట్టలేక ఎన్నో అన్నది. మానవునికి తోటి మానవుని అర్థం చేసుకోనటం చాలకష్టం. ఒకరి ఆశయాలు, ఉద్దేశ్యాలు, యితరుల ఆశయాలు, ఉద్దేశ్యాలతో కలవాలని ఎచ్చటా లేదే. నా ఉద్దేశ్యాలను నిష్కల్మషంగా వ్రాశాను. అంతే. అదే చంద్రం నేను చేసినపని. పారూకు కోపంవచ్చి, తనంటే నాకు యిష్టంలేక, యిలా నాటక మాడాననే బాధతో, ఇవాడు వచ్చింది. నన్ను ఎన్నోమాట లన్నది. నీవు వచ్చేవరకు ఏడుస్తూనే వుంది నేను చేసినపని తప్పు కావచ్చు"

"అయితే స్త్రీలు కూడ......"

"అవును పారూ. నీ వడిగే ప్రశ్న నాకు తెలుసు. వాళ్ళు నుట్టకు యిలా ఎందుకు బాధపడరు. అంతస్తులలో భేదం వుందని, వాటి పర్యవసానం ఆలోచించ గలవాళ్ళు ఎవరైనా అలా అనుకోవచ్చు. వాళ్ళూ, రక్తమాంసాలు, వున్న మనుష్యులే. ఆశలు, మమతలు, మనుకోరాలూ వున్న వ్యక్తులే. కాని వాళ్లు బయటకు చెప్పలేరు. అనేక పేర్లు వాళ్ళకు పెటి, అనేక గుణగణాలు వాళ్ళకు ఆపాదించి సమాజం వాళ్ళను నోరెత్తకుండా అలా వుంచింది. చాటుగా ఏడుస్తూ బ్రతకటం నేర్పింది. ఏ స్త్రీ అయినా ధైర్యంచేసిందంటే మగవారి మాట అలావుంచి, మీ స్త్రీలైతే, ఆమెను దుయ్యబడుతుంది. కాకులకు గ్రద్దలకు ఎంత వేస్తారు. ఆమెను అనేక విధాలుగా అపార్థం చేసుకొంటారు. కాని ప్రతివారికి తెలుసు, ఆ వ్యక్తి చెబుతున్నది నిజమని. ఎందుకనో అలా నటన ప్రాయంగా బ్రతకటం అంటే నాకు ఇష్టం ఉండదు."

రాము ఆవేశంతో అలా ఎన్నో విషయాలు చెప్పుకుపోయాడు. అతని హృదయాన్ని గాయపర్చినందుకు నే నెంతగానో బాధపడ్డాను. అతనిని నేను ఎంత చదువుకొన్నా, ఆనాడు మాత్రమే అర్థం చేసుకొన గల్గానని చెప్పాలి. అంత శాంతంగా వుండే రాములో అలాంటి భావాలున్నాయని గాని, అలాంటి అగ్ని రగులుతూ వుంటుందని గాని ఊహించలేక పోయాను. నా తప్పుకు. అతని మనస్సు కష్టపెట్టినందుకు చాల విచారించాను. క్షమాపణ కోరుకోనా లనుకొన్నాను. చంద్రం వుండటంవల్లనైతే నేమి, సిగ్గు వల్ల నైతేనేమి, ఎచ్చటో దాగియున్న అహంకారం వల్లనైతేనేమి. మెదలకుండా కూర్చుండిపోయాను. చంద్రం తలవంచుకొని, నిశ్చేష్టుడై, ముఖాలవంకైనా చూడకుండా కూర్చొన్నాడు. అతను వింటూ అలా ఎంతసేపుకూర్చున్నాడో, అతనిలో ఎలాంటి భావాలు కలిగినవో నేను యిప్పుడు చెప్పలేను. చాలసేపు ముగ్గురం నిశ్శబ్దంగా నే కూర్చొన్నాము. తరువాత నెమ్మదిగా చంద్రం "రామూ..."అని పిలిచాడు.

"ఏమిటి చంద్రం?"

"నీకు అలాంటి వుద్దేశ్యాలు వుంటాయనిగాని, నీవు అలా అనేక విషయాలు ఆలోచిస్తూ, బాధపడుతూ వుంటావనిగాని, నిన్ను చూసినవాళ్లు ఎవ్వరూ అనుకోరాము. నేను పారు అంటే అంత ప్రేమగా వుంటానికి, మీ స్నేహం కొరకు, తహ తహ లాడటానికి కారణం వుంది. అది వింటే, నా అమాయకత్వానికి, తెలివితక్కువతనానికి మీరు నవ్వనవ్వకూడను. మా వూళ్ళో ఒక అమ్మాయి వుండేది. ఊళ్ళోకల్లా అందమైన పిల్ల. ఆ అమ్మాయికి పారుకు ఎక్కడా భేదమే లేదు. ఆ అమ్మాయి చనిపోయిందని తెలియకుండావుంటే, నేనేగాక, ఆ అమ్మాయిని ఎరిగున్న ప్రతివారూ, పారూని చూడటం జరిగితే దగ్గరకు వచ్చి "సుశీ" అని సంబోధించక మానరు. ఆ అమ్మాయి పేరు సుశీల. అంతా "సుశీ", "సుశీ" అంటూవుండేవారు. ఎప్పుడూ సరదాగా కిల. కిల, లాడుతూ వుండేది. వాళ్లు మా పొరుగువాళ్ళ అవ్వటం వల్ల, చిన్నప్పుడు ఎప్పుడూ మేము యిద్దరం కల్సి ఆడుకొంటూ వుండేవాళ్లం. ఆ చిన్ననాటి రోజులు ఎంతో ఆనందంగా గడిచిపోయినాయి. నేను చదువు కొరకు మా వూరు వదలాను. వాళ్లు 'సుశీ'కి పెళ్ళిప్రయత్నాలు చేస్తున్నారు. వూళ్లోనే ఒక భాగ్యవంతునికి ఒక కొడుకున్నాడు. ఆ మహానుభావుని పేరు ప్రఖ్యాతులు చెప్పనలవిగాదు. అతనికి వాళ్ళ కుటుంబస్థాయిలో సంబంధాలు రావటంలేదు. సుశీ చాల అందమైనది. అతనికికూడ ఆమెపై కన్నుపడింది. మొదట కుబుద్ధితో పడ్డకన్ను, ఎలాగో అలా ఆమెను చేపటాలనే తలంపుకు తెచ్చింది. సుశీ తల్లిదండ్రులుకూడ ఆ పెళ్ళికి యిష్టపడారు. ఆ మూడుముళ్ళు పడ్డ తరువాత, అమ్మాయికి లోంగి, యింటిపద్దనే పడియుంటాడని, కని, విని ఎరుగనిమార్పులు అతనిలో వస్తాయని, అమ్మాయి భోగ భాగ్యలతో తులతూగుతూ వుంటుందని, తలచి పెళ్ళిచేశారు. వాళ్ళు 'సుశీ' ఉద్దేశ్యం తెల్సుకొన్నారో లేదో నాకు తెలియదు. నా ఊహకు అందినంతవరకు వాళ్ళు అలా చేసివుండరు. అసలు 'నిజానికి 'సుశీ'కూడ 'పారు'లా నోటిలో నాలుక లేనిమనిషి. పెళ్ళి అనుకోనకముందు చూడటమే తరువాత నేనెప్పుడూ 'సుశీ'ని చూడలేదు. పెండ్లి అయినతరువాత అందరూ అనుకొన్నట్లుగానే, కొంతకాలం చాల హాయిగా గడిచిపోయింది. సుశీకి ఒక ఆడపిల్లకూడ కల్గింది. మళ్ళీ సుశీభర్త మామూలుధోరణికి వచ్చాడు. సుశీ చేయవల్సిన ప్రయత్నాలు అన్నీ చేసింది. అతని అత్యాచారాలకు అంతులేకుండా పోయింది. త్రాగివచ్చి సుశీని బాదటం, అధం, శుభం ఎరుగని పిల్లను వారసురాలవుతుందని తిట్టటం, చంపబోవటంవరకూ వచ్చింది. సుశీ ఈ విషయాలన్నీ చాలకాలం ఎవ్వరికీ తెలియనీయలేదు. ఒకసారి భర్త కూతురిని చంపటానికి ముసుగులో తీసుకెళ్ళే ప్రయత్నంలో వుండగా సుశీ గదిలోకి వెళ్ళిందట. అతను సుశీని చెడామడా తిట్టి బిడ్డనువదలి బయటకి వెళ్ళాడట. అనోటా ఈనోటాబడి కన్నవారికి ఈవిషయాలన్నీ తెలిసినాయి. వాళ్ళు సుశీని ఇంటికిరమ్మన్నారు. సుశీ ఎక్కువగా నోరు తెరచి, మనస్సులో వున్నది విప్పిచెప్పకపోయినా, చాల అభిమానంగల వ్యక్తి. ఆ పెళ్ళి తరువాత తలిదండ్రులపై ఆమె కంత అభిమానం వుండకపోవచ్చుకూడాను. వాళ్ళకు తన కుటుంబంసంగతి అనవసరమని, వాళ్ళను తన ఇంటి చాయలకు కూడ రావద్దని ఒకరోజు ఖండితంగా చెప్పిందట. మా అమ్మ అంటే సుశీకి ఎంతో ప్రేమ గౌరవమూను. మా అమ్మ అప్పుడప్పుడు చూడటానికి వెళ్ళినప్పుడు, అన్నీ చెప్పుకొని ఏడుస్తూ వుండేదట. నన్ను గూర్చి ఎన్నో విషయాలు అడుగుతూవుండేదట. అలా కాలం గడిచిపోతూవుండగా, ఒకనాడు చిన్నబిడ్డ చనిపోయిందన్నారు. మరోనాడు సుశీ చనిపోయిందన్నారు. ఊరంతా చిలువలుపలువలుగా చెప్పుకొన్నారు. మా అమ్మ అప్పుడు ఏడుస్తూ, వివరంగా ఉత్తరం వ్రాసింది. నేను వెంటనే వూరుకోనలేక సుశీ ఏనాడో. పెళ్ళికి ఒప్పుకొన్ననాడే చనిపోయిందని అసలు సుశీ కూతుర్ని చంపి, తను ఆత్మహత్య చేసుకొనివుంటుందని మా అమ్మకు వ్రాశాను. తరువాత నెమ్మదిమీద అదే నిజమని తేలింది."

మేము ఇద్దరం, అలా వింటూ నేకూర్చొన్నాము. చంద్రం కొద్దిసేపు ఆగి మరల చెప్పుకుపోసాగాడు.

"అది సుశీ జీవితచరిత్ర. నేను రీసెర్చికోసం యూనివర్శిటీకి వచ్చినప్పుడు. పారు తెలివితేటలను గూర్చి, గుణగణాలను గూర్చి చెప్పగా విన్నాను. తరువాత పారును చూసినప్పుడు చాల ఆశ్చర్యపడ్డాను. "సుశీ" అసలు చనిపోలేదేమోననికూడ అనుమానించాను. డిటెక్టివు కథలలోవలె "సుశీ" అంతర్ధానమై, పారు అనే పేరుతో ప్రత్యక్షమై, చదువుకొని, ఇంత పైకి వచ్చిందనుకొన్నాను. పారూతో మాట్లాడటం అంటే నాకూ భయంగాను, బెరుకు బెరుకుగాను వుండేది. తాను ఎప్పుడూ నోరు తెరచి మాట్లాడేది గాదు, ఏదో పెద్ద అవసరంవుంటే తప్పితే. నాడు నేను వెళ్లినుంచీ, చెడూ మాటాడటానికి, పారు అపార్థం చేసుకొంటుందేమోనని బిడియపడుతూ వుండేవాడిని.

పారూతో మాట్లాడాలని, ఆమె సంసారం సంగతి తెల్సుకోవాలని అభిలాష ఎక్కువగా వుండేది. సుశీకి, పారూకు భేదం లేకపోవటంవల్ల, పారూ, జీవితం కూడ, సుశీ జీవితంలా అవుతుందేమోనని, నేను బాధతో తహతహలాడుతూ వుండేవాడిని. రాత్రిళ్లు కూడా పారూ వైవాహిక జీవితం ఎంతో ఆనందంగా హాయిగా వుండాలని కోరుకొంటూ వుండేవాడిని. దేవునిపై నమ్మకం లేకపోయినా దేవుని ప్రార్థిస్తూ వుండేవాడిని. దాని అంతటకు కారణం, పారూ, సుశీ ఒకటేగా వుండటమే. తరువాత. తరువాత నెమ్మదిగా మాట్లాడుకోనటం మొదలు పెట్టాము. ఒకసారి పారు నన్ను మీ యింటికి ఒక్కసారి రమ్మని పిల్చినప్పుడు, నిన్ను చూడాలనే కుతూహలంకొద్దీ వెంటనే అంగీకరించాను. నిన్ను చూచిన తరువాత, నీతో అనేక విషయాలు చర్చించిమీదట నా హృదయం ఎంతో తేలికపడింది పారూ అదృష్టానికి ఎంతగానో ఆనందించాను. ఆనాటినుండే, యీనాటివరకు పారూ అంటే నాకేమీ వేరు ఉద్దేశ్యం లేదు. నా భయం పోయింది. మీరు కలకాలం ఎంతో హాయిగా గడపాలని నేను కోరుకొంటూ వుండేవాడిని రాము."

నేను వాళ్ళమాటలు వింటూ, మూగవానిలా కూర్చొన్నాను మనుష్యులు ఎదురుబొదురుగా కూర్చొని హృదయాలు విప్పి చెప్పుకొంటూ వుంటే ఎలా వుంటుందో ఆనాడే తెల్సుకొన్నా; ఎలాంటి సమస్యలైనా సర్దుబాటు చేసుకోవచ్చునని తలంచాను. నేను "అయితే చంద్రం, మా చెల్లెలు సంగతి చెప్పనేలేదే!" అని అడిగాను ఎంతో తేలికపడ్డ హృదయంతో.

"అవును చంద్రం, మాటలలో పడి మర్చిపోయా. మరదలుపిల్ల విషయాలు చెప్పనే లేదే!" అని అడిగాడు రాము, ఎంతో అనురాగంతో.

"ఏమివున్నది రాము చెప్పటానికి. నేను నిలా ఎన్నో విషయాలను గూర్చి ఆలోచిస్తూ వుంటాను, బాధపడుతూ వుంటాను, మానవజీవితాన్ని అసహ్యించుకొంటూ వుంటాను కూడాను ఎవ్వరికీ చెప్పను. చెప్పినా ఎంతమంది అర్థం చేసుకొంటారు గనుక. నవ్వుతారేమోననే భయంతో నేను అలా మూగవానిలా ఆలోచిస్తూ. ఏడ్వలేక నవ్వుతూ కాలం గడుపుతూ వుంటాను. వెనుకకు తిరిగి జీవితంలోకి తొంగి చూస్తే జీవితం చాల గమ్మత్తనిపిస్తుంది. మాది చాల పేదకుటుంబం. మా నాన్న పొలాలు కౌలుకు చేసి, మా అమ్మ పెరుగూ పాలు అమ్మి నన్ను ఇంతవరకు తెచ్చారు. నేను చదువుకొంటానని ఎవ్వరూ అనుకోనలేదు. నాకు యిలా అవకాశాలు కల్సివస్తాయని నేనూ ఊహించలేదు. నేను గొడ్లను పొలం తోలికెళ్లితే పాలు బాగా యిస్తాయని మా నాయనమ్మ నన్ను గొడ్లకాడికి పంపుతూ వుండేది. మా నాన్నకు మంచికీ, చెడుకు ఎప్పుడైనా కావాలంటే 10 రూపాయలు అప్పుగా యివ్వటానికి ఒక షాహుకారు వుండేవాడు. ఆయనకు నేనంటే చాల యిష్టం. నేను రీసెర్చిలో చేరిన తరువాత, ఆ షాహుకారు వాళ్ళమ్మాయిని నాకు యిచ్చి వివాహం చేయాలనుకొన్నాడట. అది వాళ్ల ఆడవాళ్లకు ఎవ్వరికీ యిష్టంలేక "పెరుగూ, పాలు అమ్ముకొని బ్రతికేవాళ్ల అబ్బాయికి, ఎంత చదువుకొంటేమాత్రం, మన అమ్మాయిని యిస్తామా" అన్నారట. నా జీవితంలో యీ సంఘటన మరువలేను. తరువాత నాకు అమెరికానుండి స్కాలర్‌షిప్ యిస్తామని ఉత్తరం వచ్చిన తర్వాత, అమ్మకు, నాన్నకు చెప్పి, వాళ్ళ ఉద్దేశ్యం కనుగొందామని, కొంతడబ్బు కూడ అవసరమని చెప్పటానికి మా యింటికి వెళ్ళాను. అమ్మ అన్నం పెట్టి నాకు ఎదురుగా కూర్చుంది. ఆమె ఎప్పుడూ అలా అంతకు పూర్వం చేయలేదు. నేను తల ఎత్తి చూద్దును గదా—ఆమె కన్నీళ్ళు కారుస్తూ ఎదురుగా కూర్చొనివుంది. వీళ్ళందరిని వదలి వెళ్ళవలసి వస్తుందే, ఈపాటకు నాకూ యింకా ఎన్నాళ్ళో సఖ్య సంబంధాలు మొదలైన విషయాలనుగూర్చి ఆలోచిస్తూ అమ్మకు సంతోషవార్త చెబుదామని తల ఎత్తేటప్పటికి ఏడుస్తూ వున్న ఆమెను చూశాను. క్రుంగిపోయాను. అదే మొదటిసారి ఆమె అలా ఏడ్వటం చూడటం. తడబడుతూ, ఎందుకమ్మా అని అడిగాను. "వాళ్ళు అలా అన్నారట. ఎవరు వాళ్ళనసలు అడిగారు! ఎవరనమన్నారు?" అంటూ ఆవురుమంది. నాకు చాల బాధకల్గింది. కాని అణచిపెట్టుకొని "తప్పు ఏముంది అమ్మా ఉన్న మాట అన్నారు. నిజానికి మనం గర్వపడాలి" అని మరల కొద్ది సేపటికి, "అమ్మా నేను వచ్చేనెల అమెరికా అనే దేశం చదువుకోనటానికి వెళ్ళుతున్నా. వాళ్ళు స్కాలర్‌షిప్ యిచ్చారు. అంటే అన్ని ఖర్చులు వాళ్ళవే.' అంటూ ఏమేమో ఆమెను సంతోషపెట్టటానికి చెప్పాను. ఈనాటికి ఆమె హృదయవేదన నాకు గుర్తుకు వచ్చినప్పుడల్లా చాల బాధగా వుంటుంది.

"వివాహం అంటే నాకు ఎప్పుడూ గమ్మత్తయిన అభిప్రాయాలంటూ వచ్చాయి. ఈనాడుకూడ అంతే. నేను నిజానికి మంచిచేస్తున్నానో, చెడు చేస్తున్నానో కూడ నాకు తెలియదు. నేను జీవితంలో ఏపని చేసినా ఏనిర్ణయానికివచ్చినా, ఆవేశంతో నేగాని తార్కికంగా ఆలోచించి చేయటం ఇంతవరకు జరుగలేదు. ఈనాడు నా పెళ్లివిషయంలో కూడ అంతే. నా యీ పాత్ర సుఖాంతం అవుతుందో, దుఃఖాంతం అవుతుందో నాకు తెలియదు. కాని నేను తెల్సి ఏప్రాణిని కష్టపెట్టటం జరుగలేదు. నా స్వార్థంకొరకు పరుల గొంతుకలు కోయటం, వాళ్ళను వుపయోగించుకోనటం, నాకు

చేతగానిపని. ఇకముందుకూడ అలాగే బ్రతుకగలనని నాఆశ. అలా బ్రతకాలనేది నా ఆశయం కూడాను. నేను అమెరికానుండి మా వూరు తిరిగి వెళ్ళిన తరువాత ఒక స్నేహితుని యింటికి ఆహ్వానంమీద భోజనానికి వెళ్లాను. అప్పటొక అమ్మాయిని చూశాను. చాల అందగత్తెగా తలంచాను. తరువాత మా స్నేహితునిద్వారా ఆ అమ్మాయి బి. ఎ. చదివినట్లు, చిత్రలేఖనంలోను, సాహిత్యంలోను, ప్రవేశం వున్నట్లుగా కూడ తెల్సుకొన్నాను.

"ఆ అమ్మాయిని ఎవరు చేసుకొంటారోగాని చాల అదృష్టవంతు డవుతాడు" అన్నాను, వూరుకోనలేక.

"కొంపతీసి ఆ పిల్లమీద కన్ను వేయలేదుగదా!" అన్నాడు మిత్రుడు.

"అందమైన అమ్మాయిని చూడటం. అందులో ఆమెనుగూర్చి అలా విన్నప్పుడు, అలా అనుకోనటం, అనటం సహజమేగా." అన్నాను.

"నీవు, ఆ అదృష్టవంతుడ వవ్వాలనే ఆశేవుంటే మాట్లాడుతా."అని అన్నాడు నా స్నేహితుడు.

"నిజంగానా?" అన్నా చటుక్కున, ఆ అమ్మాయిని మర్చిపోలేని నేను.

"కాని..."అని ప్రశ్నార్థకంగా చూశాడు నా స్నేహితుడు నాముఖం లోనికి.

"ఏమిటి? ఉన్న వారికిగాని యివ్వరా? అయితే అంత బాధ ఎందుకు. ఆ అమ్మాయి సుఖపడటమేగా కావల్సింది." అన్నాను.

"అదిగాదు చంద్రం; ఆ అమ్మాయి నా మరదలే. ఆ అమ్మాయికి నీలాంటి వానిని భర్తగా పొందగల అదృష్టం వున్నదా! అనే విషయాన్నే నేను ఆలోచిస్తున్నాను. ఆ అమ్మాయి విధవ. అలా కనుపించదు వయస్సులోకూడ. బి. ఎ. చదివిన పిల్లలా వుండదు గదూ. చాల చిన్నతనంలో పెళ్ళిచేశారు. 12 వ సంవత్సరంలో వుండగనె అతను చనిపోయాడు. ఆ బాధతోనే, మాఅత్తా, మామలుకూడ పోయారు. ఆ ఆస్తికూడ నాకు యిచ్చినదానికన్నా, ఆ పిల్లకే ఎక్కువవుంది. నా బలవంతంవల్లే చదివింది. తగినవానిని చూసి పెళ్ళి చేయాలనివుంది." అని చెప్పాడు కన్నీళ్ళతో.

"అతని ప్రతిమాటలోను, ఆ అమ్మాయి అంటే వుండే ప్రేమా, ఆదరం ఉట్టిపడుతూన్నాయి. మర్చిపోయా పేరు చెప్పటం. సులోచన.

"నేను నాకు ఏమీ అభ్యంతరం లేదని మాఅమ్మానాన్నకు చెప్పి ఏ విషయమూ మరునాడు చెప్పగలనని చెప్పి, యింటికివెళ్ళి, అమ్మకు, నాన్నకు చెప్పాను. వాళ్లూ మొదట కొద్దిగా వెనుకాడారు. ఆకుటుంబంకూడ మంచిదవటంవల్ల, నాస్నేహితుడు నేను అమెరికాలో ఉన్నప్పుడు మా అమ్మను, నాన్నను, తన వాళ్ళుగా చూడటంవల్ల అన్నిటికన్నా. నన్ను కాదనటం యిష్టంలేకపోవటంవల్ల అంగీకరించారు. అందువల్ల నే అనుకోనకుండా యిలా కల్సివచ్చింది. అప్పట ఊరకొట్టాను. యిప్పుడు మీ కొరకు పరుగెత్తుకొచ్చాను." అన్నాడు చంద్రం నవ్వుతూ మాయిద్దరివంకా చూసి.

"నవరత్నాలు అన్నీ ఒక్కచోట, సత్పురుషులు ఒకచోట అన్నట్లు. మీయిద్దరిని అన్నదమ్ములుగా చేసిన ఆదేవుణ్ణే అనాలి. మీ ఆలోచనలు, ఊహలు వింటె ఎవ్వరైనా నవ్విపోతారు." అన్నా ఎంతో తేలికపడిన హృదయంతో, పట్టరాని ఆనందంతో. ఇక నిద్రపోవలేనని చెబుతూ - చూస్తూ చూస్తూ వుంటే వాళ్లు అలా కూర్చుని రోజులతరుబడి, సంఘాన్ని, జీవితాన్ని గూర్చి ఆలోచించేట ట్లున్నారు.

పడుకొనటానికి లేవబోయేముందు, యిష్టమైతే తాను తనకంపెనీ మేనేజరుతో చెప్పి రాముకు ఢిల్లీలో ఉద్యోగం యిప్పిస్తానన్నాడు చంద్రం. రాము మౌనమే అర్ధాంగీకారం ఉన్నటుగా "ఊ" కొట్టి వూరుకొన్నాడు.

వెన్నెల పిండి ఆరబోసినట్లున్నది. ఆకాశం ఎంతో నిర్మలానందంగా వుంది. నల్లనిమబ్బు మచ్చుక్కూడ, అక్షణంలో కనిపించని ఆకాశంవంక చూస్తూ వుంటే, తేలికపడిన నాహృదయానికి ఏదో నూతనానుభూతి కల్గినట్లుగా తలంచాను. నాలో నేనే, నా అదృష్టానికి, నవ్వుకొన్నాను. వ్యక్తికి, వ్యక్తికి, ఆలోచనలలో ఎంత తేడా వుంటుందో, అసలు పైకి కన్పించే వ్యక్తికి, లోపలి ఆలోచనలకు ఎంతసంబంధం వుంటుందో తెల్సుకొన్నప్పుడు మానవ జీవితం ఎంత క్లిష్టంగా వుంటుందో అర్థమవుతుంది. ఉరుములు, మెరుపులు, తరువాత కుంభవర్షం, ఆ తరువాత ఆకాశం ఎంత నిర్మలంగా వుంటుందో, భయంకర ఝంఝూవాతం తరువాత, సముద్రం ఎంత ప్రశాంతంగా వుంటుందో అలాగే యీ అనిర్వచనీయమైన మానవజీవితమేమో!